సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 14 । జూలై । 2023



నెల్లూరు, అనంత జట్ల విజయం

ఏసీఏ సౌత్‌జోన్ అంతర జిల్లాల అండర్-19 క్రికెట్ టోర్నీలో నెల్లూరు, అనంతపురం జట్లు విజయం సాధించాయి. -IIలో..



సిమెంట్ ట్యాంకర్ బీభత్సం

గోపవరం మండలం పి.పి కుంట చెక్‌పోస్ట్ వద్ద సిమెంట్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. -IIలో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1290	రూ.1400
రెండోరకం	రూ.1050	రూ.1260



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 517 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	250	515
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 364.46 కిలోలు

కురవని వాన.. కర్షకుడి హైరానా

పొలాలు దున్ని.. విత్తనాలు సిద్ధం చేసుకుని.. ఆకాశానికేసి చూస్తున్న అన్నదాతకు మరోసారి నిరాశే ఎదురైంది. అదును దాటుతున్నా పదును వాన లేకపోవడంతో రైతు నేల చూపులు చూస్తున్నాడు. వరుణుడే కరుణించింటే ఈ పాటికి పొలాలన్నీ పచ్చగా కళకళలాడేవి. ముఖం చాటేయడంతో బీళ్లుగా మారి ఎక్కిరిస్తున్నాయి.

- జిల్లాను వెంటాడుతున్న వర్షాభావం
- వేరుశనగ విత్తుకు ఈనెల 15తో ముగింపు
- ఇప్పటిదాకా 5,144 హెక్టార్లలోనే పంటసాగు
- ఈనెల వర్షాలు కురవకుంటే ప్రత్యామ్నాయమే



తంబళ్లపల్లె మండలంలో బీడుగా ఉన్న పొలాలు

బి.కొత్తకోట: జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాగు కుదేలైంది. ఈనెల 15తో వేరుశనగ పంటను విత్తేందుకు అదును ముగుస్తుంది. తర్వాత వర్షం కురిసి పంట విత్తినా ఫలితం ఉండదు. ఈ వర్షభావ పరిస్థితులతో జిల్లాలో ఖరీఫ్ సాగు నిరాశాజనకంగా ఉండగా ఈనెల తర్వాత వ్యవసాయశాఖ ఖరీఫ్‌కు ప్రత్యామ్నాయ ప్రణాళికను అమలు చేయాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

సాగైంది 9.42 శాతం విస్తీర్ణమే

ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 82,589 హెక్టార్లలో వ్యవసాయ పంటలు సాధారణ సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనావేసింది. అందుకు తగ్గట్టుగా వ్యవసాయ ప్రణాళిక అమలు చేసింది. రైతులకు ప్రభుత్వం రాయితీ వేరుశనగ విత్తనకాయలను 30 మండలాల్లోని రైతాంగానికి అందించింది. దీంతో రైతులు ప్రభుత్వం అందించిన రైతుభరోసా నిధులు, మిగిలిన పెట్టుబడితో వేరుశనగ సాగుకు సిద్ధమయ్యారు. వానల్లేక రైతులు ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. సాధారణ సాగులో అత్యధిక సాగు వేరుశనగదే. ప్రస్తుతం 47,885 హెక్టార్లలో వేరుశనగ సాగవ్వాల్సి ఉండగా గురువారం నాటికి జిల్లాలో సాగైంది కేవలం 5,144 హెక్టార్లలోనే. ఇక మిగిలిన పంటల పరిస్థితి అలాగే ఉంది. సాగు విస్తీర్ణంలో ఇప్పటి దాకా 9.42 శాతమే పంటలు సాగు చేశారు. పంటలు పూర్తిస్థాయిలో సాగు చేయాలంటే, వర్షాలు కురిసినా ఖరీఫ్‌లో మిగిలిన గడువు సరిపోదు. గత ఖరీఫ్‌లో సాధారణ సాగు 92,320 హెక్టార్లలో పంటలు సాగవ్వాల్సి ఉండగా వర్షాభావంతో 14,390 హెక్టార్లలో పంటలు సాగు చేశారు. వేరుశనగ 55,111 హెక్టార్లలో సాగవ్వాల్సి ఉండగా 12,884 హెక్టార్ల సాగుకే పరిమితమైంది.

మొత్తం సాధారణ సాగు: 82,589 హెక్టార్లు

సాగైన పంటలు: 7,783 హెక్టార్లు

బీడు భూములు: 74,806 హెక్టార్లు



ప్రస్తుత ఖరీఫ్ వర్షపాత వివరాలు

నెల	సగటు	కురిసింది	లోటు (మి.మీ.లలో)
ఏప్రిల్	14.0	9.0	5.0
మే	46.6	74.3	27.7 (అదనం)
జూన్	75.1	39.4	35.7
జూలై	90.5	28.7	61.8



సాగైన పంటలు

పంట	సాధారణ సాగు	సాగైంది (హెక్టార్లలో)
వేరుశెనగ	47,885	5,144
వరి	9,748	625
జొన్న	633	30
మొక్కజొన్న	1,657	329
కందులు	3,671	90
ఉలవలు	6,304	--
టమాట	8,110	819



ఎదురుచూస్తున్నా..



వేరుశనగ విత్తేందుకు పొలాలన్ని సిద్ధంగా ఉంచాను. వర్షం కురవగానే విత్తనం విత్తుతాం. ప్రభుత్వం అందించిన రైతు భరోసా పెట్టుబడి సాయం రూ.5,500 అందింది. దీనికి అదనంగా పెట్టుబడిని సమకూర్చుకుని పంటసాగు కోసం వర్షం రాకకు ఎదురుచూస్తున్నా. -సి.గణపతి, రైతు, పెద్దమండ్యం

నెలాఖరువరకు అవకాశం..



రైతులు ఈ నెలాఖరులోగా వేరుశెనగను విత్తవచ్చు. జూలై 15తో అదను ముగిసినా మరో రెండువారాలు సాగు చేసుకునే వెసులుబాటు ఉంది. వర్షాలు కురవకపోతే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేందుకు రైతులు సిద్ధం కావాలి. -శివశంకర్, ఏడీఏ, మదనపల్లె

న్యూస్‌రీల్

అర్చకుల హర్షం



మాట్లాడుతున్న బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు

మదనపల్లె సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అర్చకులకు పదవీ విరమణ లేకుండా నిర్ణయం తీసుకోవడంపై ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు ఎ.ఎల్.శివకుమార్‌శర్మ, ఎ.శివకుమార్, కె.రాము, ప్రసాద్‌శర్మలు హర్షం ప్రకటించారు. గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ అర్చక వృత్తికి బ్రాహ్మణులు దూరమవుతున్న సమయంలో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గదన్నారు.

మల్లయ్యకొండ అభివృద్ధి అద్భుతం



పూజా కార్యక్రమంలో టీఎన్ అమరావతమ్మ కుమారుడు టీఎన్ అభిరామిరెడ్డి

తంబళ్లపల్లె: మల్లయకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధి అద్భుతమని టీఎన్ కుటుంబీకులు కొనియాడారు. మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి కుమార్తె టీఎన్ అమరావతమ్మ కుమారుడు, మాజీ సర్పంచు టీఎన్ అభిరామిరెడ్డి మొట్టమొదటి తంబళ్లపల్లె మండల అధ్యక్షురాలు టీఎన్ ప్రమీలమ్మ కుటుంబ సభ్యులతో గురువారం మల్లయ్యకొండను సందర్శించారు. పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. అనంతరం గౌరమ్మ గుట్టలోని గౌరమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించారు.

సాహితీవేత్తకు 'జీవిత సాఫల్యం'



డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

ప్రొద్దుటూరు: రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఓఎస్‌డీ డాక్టర్ ఎం.ప్రభాకర్‌రెడ్డికి హైదరాబాద్‌కు చెందిన విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రకటించిందని ఏపీజీబీ రిటైర్డ్ అధికారి జానమద్ది విజయభాస్కర్ తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన కవి, రచయిత, ప్రభుత్వ ఉద్యోగి అయిన డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి పలు రచనలు చేశారని.. పలు బిరుదులు, సత్కారాలు పొందారన్నారు.

నిరంతరాయంగా విద్యుత్



మాట్లాడుతున్న ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ రమణ

కడప కార్పొరేషన్: జిల్లాలో విద్యుత్ అంతరాయాలు ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ అధికారులను ఆదేశించారు. కడపలోని విద్యుత్ భవన్‌లో గురువారం నిర్వహించిన 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమంలో ఆయన వినియోగదారుల ఫిర్యాదులను ఫోన్ ద్వారా స్వీకరించారు. ఈ సందర్భంగా వచ్చిన 8 ఫిర్యాదులను గడువులోపు పరిష్కరించాలని సంబంధితులకు ఎస్ఈ ఆదేశాలు జారీ చేశారు.

నేటి డిగ్రీ పరీక్ష వాయిదా

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో నేడు (శుక్రవారం) నిర్వహించాల్సిన డిగ్రీ పరీక్షను 21వ తేదీకి వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి తెలిపారు. డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పరీక్ష వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.

నేడు డిగ్రీ కళాశాలలు బంద్

వైవీయూ : డిగ్రీ కళాశాలల ప్రవేశాల ఫీజుల తగ్గింపునకు నిరసనగా శుక్రవారం డిగ్రీ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల సంఘాల ప్రతినిధులు జి.సుబ్బారెడ్డి, శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ.ఎంఎస్.22 ప్రకారం ఏపీహెచ్ఈఆర్ఎంసీ ఫీజుల నిర్ణయం సరికాదన్నారు. శుక్రవారం నిర్వహించే బంద్‌కు అందరూ సహకరించాలని కోరారు.

శాస్త్రీయ పద్ధతితో లాభాలు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గుణశేఖర్ పిళ్లై

రాయచోటి టౌన్: శాస్త్రీయ పద్ధతులు పాటించి గొర్రెలు, మేకలను పోషిస్తే లాభాలు ఆర్జించవచ్చునని అన్నమయ్య జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై తెలిపారు. రాయచోటి పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో అధికారులు, గొర్రెలు, మేకల కాపర్లతో గురువారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొర్రెలు, మేకలు మేపు రైతులు శాస్త్రీయ పద్ధతి పాటించి మేలిరకం పశుగ్రాసాన్ని అందివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సంచాలకులు డాక్టర్ కోటేశ్వరావు, డాక్టర్ శ్రీనివాస నాయుడు, డాక్టర్ కె.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యకు సీఎం జగన్ పెద్దపీట

- మంచి చేసిన జగనన్నను ఆశీర్వదించండి
- అమ్మ ఒడి మెగా చెక్కు పంపిణీలో ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా



లబ్ధిదారులకు అమ్మ ఒడి మెగాచెక్కును అందిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : 'ఓ కుటుంబం బాగుపడాలంటే చదువుతోనే మార్పు వస్తుంది. ఆ మార్పును.. తల్లిదండ్రుల కష్టాన్ని జగనన్న గుర్తించాడు అందుకే... పిల్లలకు ఓట్లు లేకున్నా.. వారి కోసం కోట్లు ఖర్చుచేస్తున్నాడు. విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టార'ంటూ ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని టిప్పుసుల్తాన్ గ్రౌండ్స్‌లో మదనపల్లె నియోజకవర్గానికి సంబంధించి అమ్మ ఒడి మెగా చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ మిథున్‌రెడ్డి, కలెక్టర్ గిరీషా.పీఎస్, చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ విద్యా వ్యవస్థ కోసం చంద్రబాబు ఏం వెలగబెట్టారు.. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ ఎలాంటి పథకాలు అమలు చేస్తున్నారో తల్లిదండ్రులు ఆలోచించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో చక్కటి ప్రతిభ కనపరిచి రాష్ట్రానికి మంచిపేరు తెచ్చారంటే సీఎం జగన్ పేద పిల్లల భవిష్యత్తు కోసం విద్యకు పెద్దపీట వేయడంతోనే సాధ్యపడిందన్నారు. వలంటీర్లను తీసేయాలని ఓ నాయకుడు (పవన్‌కల్యాణ్) మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో 20 ఏళ్లుగా జరగని అభివృద్ధిని, వైఎస్సార్ సీపీ నాలుగన్నరేళ్ల పాలనలో చేసి చూపామన్నారు. మదనపల్లె చరిత్రలోనే పేదలకు అధికసంఖ్యలో ఇళ్ల కేటాయింపు, రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల, జిల్లా ఆస్పత్రి స్థాయిపెంపు, బీటీ కాలేజీని ప్రభుత్వ పరంతో పాటు యూనివర్సిటీ ఏర్పాటు, అనంతపురం, తిరుపతికి మదనపల్లె నుంచి నాలుగు వరుసల రహదారి, బైపాస్ వెడల్పు, ఔటర్ రింగ్‌రోడ్డు, వాటర్‌గ్రిడ్‌తో పైప్‌లైన్ ద్వారా ప్రతిగ్రామానికి తాగునీరు, వీటితోపాటు అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కలెక్టర్ గిరీషా.పీఎస్. మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ.. రాబోయే తరాల భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్న వ్యక్తి సీఎం .జగన్ అన్నారు. పక్క రాష్ట్రాల్లో మన సీఎం జగనన్న గురించి గొప్పగా మాట్లాడుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. అనంతరం మదనపల్లె నియోజకవర్గంలో 1,10,290 మంది విద్యార్థులకు సంబంధించి తల్లులకు రూ.165. 44 కోట్ల రూపాయల మెగాచెక్కును అందజేశారు. ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌లు చలపతి, నూర్‌ఆజం, ఎంపీపీ రెడ్డెమ్మ, నరసింహులు, కుసుమకుమారి, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, సీహెచ్.రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, పీకేఎం-ఉడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ధ్యేయం..
అర్హులందరికీ సంక్షేమం

- రెవెన్యూలో అక్రమాలకు తావు లేకుండా చర్యలు
- భూ సేకరణ వేగవంతంగా చేస్తున్నాం
- 'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదులపై తక్షణ పరిష్కారం
- 'సాక్షి'తో అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జేసీ, అన్నమయ్య జిల్లా

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి రాయచోటి : 'అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. భూములకు సంబంధించి ఎక్కడా ఆక్రమణలకు గురి కాకుండా చూసుకోవడంతోపాటు రెవెన్యూలో కూడా అక్రమాలకు తావు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం' ఇదీ జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ చెప్పిన మాటలు. హర్యానలోని గుర్గావ్ పట్టణానికి చెందిన ఫర్మాన్ ఇటీవలే జేసీగా బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ శాఖ పనితీరు, భూ సేకరణ తదితర విషయాలపై 'సాక్షి' ప్రతినిధితో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

జిల్లాలో పనిచేసిన అనుభవం ఉపయుక్తం

అన్నమయ్య జిల్లాలో ఇదివరకే రాజంపేట సబ్ కలెక్టర్‌గా పని చేశాను. ఆ అనుభవం ఇప్పుడు ఉపయోగకరంగా ఉంది. జిల్లాపై పూర్తిగా అవగాహన వచ్చింది. ఎక్కడికక్కడ భూ ఆక్రమణలు అడ్డుకోవడం మొదలుకొని ప్రజలను ఎప్పటికప్పుడు కలుస్తూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నా. రెవెన్యూశాఖ మొదలుకొని పౌరసరఫరాల వరకు ఎక్కడ ఏం జరుగుతుందో పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తున్నాను.

అక్రమాలు జరిగితే ఉపేక్షించేది లేదు

అన్నమయ్య జిల్లాలో రెవెన్యూ పరంగా అధికారులు అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు. ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా పరిరక్షించడం మొదలుకొని ఆన్‌లైన్, మ్యుటేషన్లు సరైన సమయంలో పూర్తి చేయాలని పదేపదే అధికారులను ఆదేశిస్తున్నాం. ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వేగవంతంగా సమస్యలను పరిష్కరించాలి.

నిత్యావసరాలు సరైన సమయంలో అందిస్తున్నాం

అన్నమయ్య జిల్లాలో నిత్యావసర సరుకులకు సంబంధించిపేద ప్రజలకు సరైన సమయంలోనే అందిస్తున్నాం. గతంలో కొన్ని ఇబ్బందులు ఎదురైనా అన్నింటినీ అధిగమించి రేషన్ వాహనాల ద్వారా గడువులోపే సరుకులను పేద ప్రజలకు అందజేస్తున్నాం. ప్రతి సీజన్‌లోనూ అవసరమైన ధాన్యాన్ని లక్ష్యం మేరకు కొనుగోలు చేస్తున్నాం.

సచివాలయాల ద్వారా అత్యున్నత సేవలు

జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రత్యేకంగా ఎప్పటికప్పుడు సచివాలయాలను తనిఖీ నిర్వహిస్తూ నాణ్యమైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయ సేవల విషయంలో గడువులోగా అందించేలా తనిఖీలు నిర్వహించి సూచనలు చేస్తున్నాం.

భూ సేకరణ వేగవంతం

జిల్లాలో ముదివీడు రిజర్వాయర్ మొదలుకొని మంగంపేట ప్రాజెక్టుకు సంబంధించి భూ సేకరణ పూర్తయింది. ఎన్‌హెచ్-716కు సంబంధించి కూడా 80 శాతం భూ సేకరణ పూర్తి కాగా, ఎన్‌హెచ్-71కు సంబంధించి కూడా 45 శాతం పూర్తి చేశాం. రోడ్లకు సంబంధించి దాదాపుగా భూ సేకరణ పూర్తి కావొచ్చింది. ఎక్కడికక్కడ భూ సేకరణ పూర్తి కాగానే పరిహారాన్ని సకాలంలో అందించేలా ముందుకు సాగుతున్నాం.

చదువు.. ఉద్యోగం

మాది హర్యానలోని గుర్గావ్‌పట్టణం. నాన్న పేరు రఫీక్ అహ్మద్‌ఖాన్, అమ్మపేరు కుష్మాబేగం. నేను 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు సొంతూరులోనే చదువుకున్నాను. బీటెక్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)- హర్యానలోని ఎండీయూ రోహటక్‌లో, మాస్టర్ ఇన్ పబ్లిక్ మేనేజ్‌మెంట్‌ను జీఎస్‌యూ ఢిల్లీలో చేశాను. డిప్లొమా ఇన్ క్రిమినాలజీ ఫ్రం ఎస్‌ఎల్‌యూ ఢిల్లీలో పూర్తిచేశాను. తర్వాత సివిల్స్ రాసి ర్యాంకు సాధించాను. 2020 బ్యాచ్‌కు చెందిన నేను ముస్సోరిలో శిక్షణానంతరం మొదటి పోస్టింగ్ నెల్లూరులో అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేశాను. ఆ తర్వాత వివిధ హోదాల్లో పలుచోట్ల పనిచేశాను. జూన్‌లో అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పదోన్నతిపై వచ్చి 22న బాధ్యతలు స్వీకరించాను.

పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ హైవే

- పెట్రోల్, డీజిల్‌లకు ప్రత్యామ్నాయాలను వినియోగించాలి
- రోడ్డు భద్రతపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి
- మదనపల్లెలో స్వాస్థ్య ఆస్పత్రి ప్రారంభించిన కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ



మదనపల్లెలో స్వాస్థ్య ఆస్పత్రిని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ, ఎంపీ మిథున్‌రెడ్డి తదితరులు

మదనపల్లె: దేశంలోని జాతీయరహదారుల నిర్మాణంలో పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర రహదారులు, రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ అన్నారు. గురువారం మదనపల్లెలో సత్సంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, పద్మభూషణ్ ముంతాజ్‌అలీ (శ్రీఎం) ఆధ్వర్యంలో నిర్మించిన స్వాస్థ్య మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌ను రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో కలిసి ప్రారంభించారు. అంతకుముందు సత్సంగ్ ఆశ్రమ ఆవరణలో మొక్కను నాటి నీళ్లు పోశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ మాట్లాడుతూ...జాతీయరహదారులపై పెద్దమొత్తంలో చెట్లను ట్రాన్స్‌ప్లాంట్ చేసేందుకు, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు 3కోట్ల87లక్షల చెట్లకు జియోట్యాగ్ చేయడంతో పాటుగా 68,000 చెట్లను ట్రాన్స్‌ప్లాంట్ చేశామన్నారు. రోడ్ల నిర్మాణంలో పర్యావరణాన్ని పెంపొందించేందుకు గ్రీన్ హైవేల నిర్మాణాలు చేస్తున్నామన్నారు.దేశంలో ప్రతిఏటా 5లక్షల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందులో 60 శాతం మంది యువకులైన డాక్టర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఉన్నత విద్యావంతులు ఉండటం బాధాకరమన్నారు. రోడ్డుభద్రత చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. దేశంలోని రోడ్లు అందరివని, అభివృద్ధికి సంబంధించి వివక్ష చూపలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్స్‌ప్రెస్ హైవేలను కేటాయించామన్నారు. దేశంలో పెట్రోల్, డీజిల్ వినియోగం అధికమవుతోందని, దాదాపు 16 వేల కోట్ల లీటర్లు దిగుమతులు చేసుకోవడం జరుగుతోందని, వీటిని తగ్గించేదిశగా ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలన్నారు. బయోఇథనాల్, హైడ్రోజన్, బయో, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ వాహనాలపై దృష్టి పెట్టాలన్నారు. ఆగస్టులో 100శాతం ఇథనాల్‌తో నడిచే టయోటా వాహనాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఆత్మనిర్భర్ భారత్ సాధనలో భాగంగా 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థికాభివృద్ధిని సాధించి ప్రపంచంలో అగ్రగామి ఆర్థికవ్యవస్థగా దేశాన్ని నిలబెట్టేందుకు ప్రధాని మోదీ నాయకత్వంలో కృషి జరుగుతోందన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల్లో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సహకారం మరువలేనిదన్నారు. పద్మభూషణ్ ముంతాజ్‌అలీ(శ్రీఎం) మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్నవారికి సాంత్వనతో స్వస్థత చేకూర్చడమే ప్రధాన ధ్యేయంగా స్వాస్థ్య మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించామన్నారు. రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టిరామలింగేశ్వరరావు, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప కలెక్టర్ గిరీషా పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి సహకరించండి

మదనపల్లె:రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని నియోజకవర్గాల్లో రహదారి అభివృద్ధి పనులకు సహకరించాలని కేంద్ర జాతీయరహదారులు, రవాణాశాఖమంత్రి నితిన్‌గడ్కరీని ఎంపీ మిథున్ రెడ్డి కోరారు. అనంతపురం (ఉరవకొండ) నుంచి కృష్ణగిరి ఎన్‌హెచ్-42 జాతీయరహదారిని 7 మీటర్లు క్యారేజ్‌వే వెడల్పుతో రోడ్డును వెడల్పు చేసేందుకు తాత్కాలికంగా రూ.20కోట్లు విడుదల చేయడంతోపాటు అనుమతులు ఇవ్వాలని కోరారు. అలాగే పీలేరు పట్టణంలో మదనపల్లె-నాయుడుపేట ఎన్‌హెచ్-71 రహదారిని 7 మీటర్ల వెడల్పుతో రోడ్లు వెడల్పుకు రూ.9కోట్లుతో అనుమతి, నిధుల మంజూరును కోరారు. 2022-23 వార్షిక ప్రణాళికలో పుంగనూరు పట్టణంలో బైపాస్‌రీచ్ రెండులేన్ల రహదారిని విస్తరించేందుకు అనుమతులు మంజూరు చేశారని, పట్టణంలో ప్రధాన రహదారిని సెంట్రల్ డివైడర్‌తో లైటింగ్ ఏర్పాట్లుతో చేసేందుకు అనుమతులు మంజూరు చేయాలని విన్నవించారు. ప్రధానమంత్రి గతిశక్తి నేషనల్ మాస్టర్‌ప్లాన్స్‌లో భాగంగా పోర్ట్ కనెక్టివిటీ కోసం స్టేట్ హైవేలుగా ఉన్న రాజంపేట-కదిరి(వయారాయచోటి), బైరెడ్డిపల్లె నుంచి పుంగనూరు, పుంగనూరు-చిన్నగొట్టిగల్లును జాతీయరహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. నర్సాపురం బైపాస్‌రోడ్డుకు సంబంధించి భూసేకరణ పూర్తయిందని, నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

సెటిల్మెంట్లు చేయడం చట్టవిరుద్ధం

– ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు క్రైం : చట్టపరమైన అధికారుల ప్రమేయం లేకుండా భూమి, డబ్బు సంబంధిత సెటిల్మెంట్ వ్యవహారాలను నిర్వహించడం చట్టవిరుద్ధమైనదిగా పరిగణించనున్నట్లు వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఏఎస్పీ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత కేసులో చట్టవిరుద్ధమైన సెటిల్మెంట్ జరుగుతున్న క్రమంలో రామమోహన్‌రెడ్డిపై కేసులోని ఐదుగురు నిందితులు దాడికి పాల్పడ్డారన్నారు. కాల్ రికార్డులు, టవర్ లొకేషన్‌తో పాటు అక్కడ ఉన్న ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలం ద్వారా సంఘటనా స్థలంలో నిందితులు ఉన్నట్లు నిర్ధారణ జరిగిందని చెప్పారు. ఎలాంటి దర్యాప్తు చేయకుండా అరెస్ట్ చేసినట్లు కొందరు ఆరోపించడం సరికాదని ఏఎస్పీ తెలిపారు. ఈ కేసులోని ఫిర్యాది శాంతమ్మ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చే సమయంలో కూడా ఇరువర్గాలను రామాంజనేయులరెడ్డి భూ తగాదాపై సెటిల్‌మెంట్‌కు పిలిచినట్లు స్వయంగా వెల్లడించినట్లు ఏఎస్పీ తెలిపారు. సదరు సెటిల్మెంట్ చేయడమనేది చట్టవిరుద్ధంతో పాటు నేరమని చెప్పారు. ఇప్పటి వరకు సంబధిత అధికారుల నుంచి పోలీసులకు పోస్టుమార్టం సర్టిఫికెట్ అందలేదన్నారు. అయితే ఒక వ్యక్తి వీడియోలో తన వద్ద పోస్టుమార్టం సర్టిఫికెట్ ఉన్నట్లు చెప్పాడన్నారు. సాక్షులను ప్రభావితం చేసే లేదా దర్యాప్తును తప్పుదోవ పట్టించేలా అసత్యాలు ప్రచారం చేయడాన్ని తీవ్రంగా పరిగణించడం జరుగుతుందన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రామమోహన్‌రెడ్డి కేసులో అవాస్తవాలను, అసత్యాలను ప్రచారం చేయొద్దని పోలీసుశాఖ తరపున ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ : వ్యక్తి మృతి


ప్రసాద్ మృతదేహం

బి.కోడూరు : వైఎస్సార్‌జిల్లా రాఘవరెడ్డిపేట గ్రామ సమీపంలో బద్వేలు – పోరుమామిళ్ల ప్రధాన రహదారిపై బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఎం.నరసింహ్మాపురం గ్రామానికి చెందిన యడవల్లిప్రసాద్ (36) అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలు.. పాస్‌పోర్టు రెన్యువల్ నిమిత్తం తన స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంలో తిరుపతికి బయలుదేరాడు. మార్గమధ్యలోని రాఘవరెడ్డిపేట సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గడ్డం కింద, తలకు వెనుకభాగంలో బలమైన గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బి.కోడూరు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గురువారం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, ఎంపీపీ కోడూరుచెన్నమ్మ, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి ప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చల్లారని జ్వాల

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో గురువారం కూడా నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రజలకు ప్రభుత్వ సేవలు దూరం చేయాలనే కుట్రలపై ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. పవన్ దిష్టిబొమ్మలను చెప్పులతో కొడుతూ ర్యాలీ నిర్వహించి దహనం చేశారు. తమకు క్షమాపణలు చెప్పేవరకు ఆందోళనలు కొనసాగిస్తామని వలంటీర్లు స్పష్టం చేస్తున్నారు.

- పవన్ వ్యాఖ్యలపై వెనక్కు తగ్గని వలంటీర్లు
- కొనసాగుతున్న ఆందోళనలు
- పవన్ దిష్టిబొమ్మల దహనం
- క్షమాపణకు డిమాండ్


చింతకొమ్మదిన్నెలో.. పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

వేంపల్లె : వలంటీర్ వ్యవస్థపై జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం మండలంలోని ముతుకూరు గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను తీసుకొచ్చారన్నారు. అందులో భాగంగా ఒంటరి మహిళలు, వితంతువులు, వికలాంగులు, వృద్ధుల వివరాలను సేకరించి సమాచారం ఇస్తున్నారని పవన్ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పేదల కోసం నిష్పక్షపాతంగా సేవ చేస్తున్న వలంటీర్ల సేవలు కనిపించడంలేదా అని వారు ప్రశ్నించారు. వలంటీర్ల వ్యవస్థను నిర్వీర్యం చేయాలనే పవన్ భేషరతుగా క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు

చింతకొమ్మదిన్నె : వలంటీర్లపై పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని మండల కన్వీనర్ గూడ ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో వలంటీర్లు నిరసన చేపట్టి అందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి వలంటీర్లు కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో సీకేదిన్నె సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీరామిరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు మాతంగివ సుబ్బరాయుడు, అట్లూరి సుబ్బరాయుడు వలంటీర్లు పాల్గన్నారు.

క్షమాపణ చెప్పాలి

సింహాద్రిపురం : జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఇటీవల వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సింహాద్రిపురంలో గురువారం వలంటీర్లు ఆందోళన చేపట్టారు. మానవ సేవే మాధవ సేవ అన్న రీతిలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్లపై పవన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయన మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. వెంటనే ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం వలంటీర్లు పవన్ దిష్టి బొమ్మను గురిజాల సర్కిల్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు శవయాత్రగా తీసుకెళ్లి అక్కడ దహనం చేశారు.

పవన్ దిష్టిబొమ్మ ఊరేగింపు

తంబళ్లపల్లె : సమాజంలో సేవాభావంతో విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ సేవలను సామాన్య ప్రజలకు అందజేస్తున్న గ్రామవాలంటీర్ల వ్యవస్థపై జనసేన అధినేత పవన్ కల్యాన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని గ్రామ వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్‌లో పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పవన్‌క్షమాపణలు చెప్పాలన్నారు. మండల కన్వీనర్ చౌడేశ్వర్, మల్లయ్యకొండ చైర్మన్‌మల్‌రెడ్డి,వైస్ ఎంపీపీ కరీమ్, నాయకులు శివారెడ్డి, వైవి రమణారెడ్డిలు నిరసనకు మద్దతు ప్రకటించారు.

వలంటీర్లను విమర్శించే స్థాయి పవన్‌కులేదు..

రామాపురం : వలంటీర్లను విమర్శించే స్థాయి పవన్ కల్యాణ్‌కు లేదని జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి జాకీర్ హుసేన్ అన్నారు. మండలంలోని నీలకంఠ్రావుపేటలో గురువారం వలంటీర్లతో కలిసి పవన్ కల్యాణ్ ఫొటోపత్రులను దహనం చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ . ఒక చోట కూడా గెలవలేని జనసేన అధినేత పవన్ ఇలా మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇలియాస్, వలటీర్లు పాల్గొన్నారు.


వేంపల్లె : ముతుకూరు గ్రామంలో..


తంబళ్లపల్లె: పవన్ దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న వలంటీర్లు


రామాపురం : నీలకంఠ్రావుపేటలో

కడుపు నొప్పితో సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య


ప్రియాంక(ఫైల్)

మైదుకూరు : కడుపు నొప్పి తాళలేక సచివాలయ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వైఎస్సార్‌జిల్లా మైదుకూరులో జరిగింది. మృతురాలి తండ్రి యుగంధర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మైదుకూరు మండలం నంద్యాలంపేట –2లో మైదుకూరుకు చెందిన ధనపాల ప్రియాంక (27) అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పని చేస్తోంది. ఆమె కొన్నాళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతుండేది.నొప్పి ఎక్కువ కావడంతో మూడు రోజుల కిందట విషద్రావణం తాగింది. కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి లక్ష్మీప్రసన్న ప్రియాంక మృతదేహాన్ని పరిశీలించి, ఆమె తండ్రి యుగంధర్‌ను పరామర్శించారు.

ఉరివేసుకుని..

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని కలమల్ల గ్రామంలో నివాసం ఉండే బీ శశిరేఖ (30) అనే మహిళ ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్‌ఐ సంజీవరెడ్డి గురువారం తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు వైఎస్సార్ జిల్లా కలమల్ల గ్రామంలో నివాసం ఉంటున్న ధనుంజయరెడ్డి ఆర్టీపీపీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా జీవనం సాగిస్తున్నారు.ఇతను మద్యాకి బానిసై కుటుంబానికి పట్టించుకోవడంలేదు.దీంతో కుటుంబంలో సమస్యలు వచ్చాయి. మనస్తాపానికి గురైన శశిరేఖ ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్యహత్య చేసుకుంది. మృతురాలికి ఇద్దరు సంతానం. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సిమెంటు ట్యాంకర్ బీభత్సం

- ట్రాక్టర్‌తో పాటు రెండు ఆర్టీసీ బస్సులను ఢీకొట్టిన ట్యాంకర్
- ఐదుగురికి గాయాలు



గ్యాస్ లారీని ఢీకొన్న బస్సు.


రోడ్డుకు అడ్డంగా పడిన సిమెంటు ట్యాంకర్

గోపవరం : వైఎస్సార్ జిల్లా గోపవరం మండలం పి.పి.కుంట చెక్‌పోస్టు వద్ద గురువారం నెల్లూరు – ముంబై (ఎన్‌హెచ్–67) జాతీయ రహదారిపై సిమెంట్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. ఒక ట్రాక్టర్‌తో పాటు రెండు ఆర్టీసీ బస్సులను ఢీకొట్టి రోడ్డుకు అడ్డంగా బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లతో పాటు ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు నుంచి సిమెంటు లోడుతో వస్తున్న ట్యాంకర్ అతివేగంగా దూసుకుని వచ్చి ట్రాక్టర్, ఉదయగిరి, పులివెందుల డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులను ఢీకొట్టింది. అదే సమయంలో బద్వేలు నుంచి ఉదయగిరికి వెళుతున్న ఆర్టీసీ బస్సు ప్రయాణికులను దించేందుకు ఆగింది. నెల్లూరు నుంచి పులివెందులకు వెళుతున్న బస్సు ముందు వైపు ఆగి ప్రయాణికులను దించుతోంది. అంతలో ఒక ట్రాక్టర్ కూడా రావడంతో దూసుకొచ్చిన ట్యాంకర్ ముందుగా ట్రాక్టర్, ఉదయగిరి బస్సును ఢీకొని, పులివెందుల డిపో బస్సును ఢీకొట్టడంతో ఆ బస్సు వెళ్లి మరో గ్యాస్ లోడ్‌తో వెళుతున్న లారీని ఢీకొట్టింది. ట్యాంకర్ రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో ట్రాక్టర్, సిమెంట్ ట్యాంకర్‌లకు చెందిన ఇద్దరు డ్రైవర్లు, పులివెందుల బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. నిత్యం రద్దీగా ఉండే పి.పి.కుంట సెంటర్‌లో ఇలాంటి ప్రమాదం జరగడం, ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. కాగా సిమెంటు ట్యాంకర్ అతివేగంగా రావడమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. గాయపడిన వారిని 108 సిబ్బంది బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్‌ఐ చంద్రశేఖర్, సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని రోడ్డుకు అడ్డంగా పడిన సిమెంటు ట్యాంకర్‌ను, ఆర్టీసీ బస్సులను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు, అనంత జట్ల విజయం


తలపడుతున్న కడప, నెల్లూరు జట్లు


113 పరుగులు చేసిన ప్రణీల్‌రెడ్డి


97 పరుగులు చేసిన అర్జున్ టెండూల్కర్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్–19 క్రికెట్ టోర్నమెంట్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు విజయం సాధించాయి. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో మూడోరోజు గురువారం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 75.3 ఓవర్లలో 200 పరుగుల వద్ద ఆలౌటైంది. జట్టులోని ప్రణీల్‌రెడ్డి 113 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్ సుతేజ్‌రెడ్డి 3, సృజన్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 13.1 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 58 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని మన్విత్ 29 పరుగులు చేసింది. దీంతో నెల్లూరు జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కాగా నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 366 పరుగులు చేయగా, కడప జట్టు 222 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

అనంతపురం జట్టు గెలుపు

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టు 66 ఓవర్లలో 207 పరుగుల వద్ద రెండో ఇన్నింగ్స్ ముగించింది. అనంతపురం బౌలర్లు ప్రదీప్‌రెడ్డి 5 వికెట్లు, లీలాసాయి 4 వికెట్లు తీశారు. అనంతరం రెండోఇన్నింగ్స్ ప్రారంభించిన అనంత జట్టు 16.5 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది. జట్టులోని పి. అర్జున్ టెండూల్కర్ 47 బంతుల్లో 14 ఫోర్లు, 5 సిక్సర్లతో 97 పరుగులు చేశాడు. దీంతో అనంతపురం జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 253 పరుగులు, చిత్తూరు జట్టు 191 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యయత్నానికి పాల్పడి మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు. వివరాలు మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్టకు చెందిన సీ.జ్యోతి (30) కుటుంబసమస్యల కారణంగా ఇంటిలోనే నిద్రమాత్రలు మింగింది. గమనించిన స్థానికులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా కురబలకోట మండలం కనసానివారిపల్లె పంచాయతీ కొండ తూర్పుపల్లెకు చెందినశంకర్‌రెడ్డి కుమారుడు భానుప్రకాష్‌రెడ్డి (23) ఇటీవలే విశ్వం కాలేజీ ఎంసీఏ పూర్తి చేశాడు. ఇంటి వద్ద ఉంటున్నాడు. గురువారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో టమటా పంటకు వాడే పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసుల అధికారులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం కూలీల పరారీ

పెద్దమండ్యం : గుర్రంకొండ – పెద్దమండ్యం రహదారిపై రెక్కలకొండపల్లె క్రాస్ వద్ద బుధవారం రాత్రి ఎర్రచందనం కూలీలు పరారయ్యారు. వాల్మీకిపురం పోలీసుల నుంచి తప్పించుకొని గుర్రంకొండ మీదుగా పెద్దమండ్యం వైపు కూలీలు కారులో వస్తున్నట్లు స్థానిక పోలీసులకు సమాచారం రావడంతో రెక్కలకొండపల్లె క్రాస్ వద్ద కాపు కాచారు. గమనించిన ఎర్రచందనం కూలీలు కారును అక్కడే వదిలేసి పరారయ్యారు. కారును స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.కూలీల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్‌ఐ రమాంజనేయుడు తెలిపారు.

కూతురు,మనవరాళ్లు కనిపించలేదని ఫిర్యాదు

ఒంటిమిట్ట : మండల పరిధిలో రాచగుడిపల్లి పంచాయతీ నందానగర్ గుట్టపై నివాసం ఉంటున్న సుంకర రాజేశ్వరి(29) బుధవారం మధ్యాహ్నం తన ముగ్గురు కూతుర్లతో సహా కనిపించకుండా పోయిందని ఆమె తండ్రి శ్రీనివాసులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానికుల కథనం మేరకు...రాజేశ్వరి తన భర్త దగ్గర నుంచి 4 నెలల కిందట వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి వచ్చాక భర్త దగ్గకు వెళ్లకుండా తండ్రి ఇంటి వద్దే ఉండేది. ఏమైందో తెలియదు కానీ బుధవారం మధ్యాహ్నం ఇంటిలో ఎవరూలేని సమయంలో ముగ్గురు కుమార్తెలు యోగిత(9), చైతన్య(7), సమీర(5)లను తీసుకోని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇంటికి వచ్చిన శ్రీనివాసులు కూతురు, మనవరాళ్లు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. అయినా ఆచూకీ తెలియక పోవడంతో గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆటో బోల్తా : నలుగురికి తీవ్రగాయాలు


గాయపడిన సహనాజ్

ములకలచెరువు : అదుపుతప్పి ఆటో బోల్తాపడటంతో నలుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. 108 సిబ్బంది కథనం మేరకు... ములకలచెరువులోని కదిరి రోడ్డుకు చెందిన అల్లాభక్షు అనారోగ్యం కారణంగా మదనపల్లె ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స చేయించడానికి అతని చెల్లెలు సహనాజ్(38), బంధువులు బీబీజాన్(40), రోషిణి(20), అల్లాభక్షు(45)లు అద్దె ఆటోలో మదనపల్లెకు బయలుదేరారు. బురకాయలకోట వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇవ్వబోయి అదుపుతప్పి గుంతలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. అటువెళ్లే ప్రయాణికులు గమనించి 108 వాహనం ద్వారా వారిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మరో ప్రమాదంలో..

అదే విధంగా నారమాకులతాండాకు చెందిన శంకర్‌నాయక్(45) ద్విచక్రవాహనంలో వస్తూ, పట్టణంలోని గొల్లపల్లి రింగ్‌రోడ్డు వద్ద అదుపుతప్పి పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఔట్‌పోస్టు సిబ్బంది సంబంధిత పోలీసులకు సమాచారం అందించారు.

భక్తిశ్రద్ధలతో ఆడికృత్తిక ఉత్సవం

కడప కల్చరల్ : కడప నగరం కొత్త కలెక్టరేట్ కూడలిలోగల శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి మందిరంలో ఆడికృత్తిక ఉత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 5.00 గంటల నుంచి ఆలయంలో విశేష పూజలు ప్రారంభించారు. నగరం మధ్య గల ఆలయం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున పూజలకు హాజరయ్యారు. సాయంత్రం విశేష పూజలు, కల్యాణోత్సవం నిర్వహించారు. ఆ ప్రాంతమంతా భక్తులతో సందడిగా మారింది. చిన్నచౌకులోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ సుబ్రమణ్యస్వామికి ఆడికృత్తిక సందర్భంగా విశేష ఉత్సవం నిర్వహించారు. ఉదయం 7.00 గంటల నుంచి విశేష పూజలు, పలు రకాల హోమాలు నిర్వహిచారు.

చిట్వేలిలో..

చిట్వేలి : కృత్తిక నక్షత్రాన్ని పురస్కరించుకొని స్థానిక అమ్మవారిశాలలో సోమేశ్వర ఆలయంలో సుబ్రమణ్యస్వామికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు గురువారం ఉదయం అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిశాలలో సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం సుబ్రమణ్యస్వామి వారికి మేళతాళాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు.

ఘర్షణ : ఇరువర్గాలపై కేసు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని ఇస్లాంపురం వీధిలో గురువారం జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నిజాముద్దీన్‌కు ఇస్లాంపురం వీధిలో షాపింగ్ గదులు ఉన్నాయి. జావిద్‌తో పాటు కొందరు అతని స్నేహితులు రోజు షాపింగ్ గదుల ముందు కూర్చొని ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్నారు. ఇక్కడ ఎందుకు కూర్చుంటున్నారని జావిద్ వారిని ప్రశ్నించారు. దీంతో జావిద్‌తో పాటు కొందరు వ్యక్తులు ఆయిల్ మిల్లు ఖాజా ఆఫీసుకు వెళ్లి వాళ్ల మనుషులపై దాడి చేశారు. నిజాముద్దీన్ ఫిర్యాదు మేరకు జావిద్‌తో పాటు కొందరిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు.

ప్రశ్నించినందుకు దాడి చేశారని..

ఇస్లాంపురం వీధిలో జావిద్‌తో పాటు అతని స్నేహితులు కూర్చునే వారు. ఇక్కడ కూర్చోవద్దని నిజాముద్దీన్ చెప్పడంతో ఈ విషయాన్ని ప్రశ్నించేందుకు జావిద్‌తో పాటు కొందరు వ్యక్తులు ఆయిల్‌మిల్లు ఖాజా ఆఫీసు వద్దకు వెళ్లారు. దీంతో వారిపై ఆయిల్‌మిల్లు ఖాజాతో పాటు కొందరు వ్యక్తులు దాడి చేసినట్లు జావిద్ చిన్నమ్మ షేక్ నూరున్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఖాజాతో పాటు ఇంకొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అభివృద్ధిపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న డీఆర్‌ఏ పీడీ సత్యనారాయణ

రామాపురం : డ్వాక్రా సంఘాల మహిళలు బ్యాంకులో తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని, అభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నమయ్య జిల్లా డీఆర్‌ఏపీడీ సత్యనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు.అనంతరం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 30,416 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, అందులో 2,600 సంఘాలు వెనకబడి ఉన్నాయని, సంఘాలను బట్టి రూ.లక్ష నుంచి రూ. 20లక్షలు వరకు రుణాలను అందించనున్నట్లు చెప్పారు. రుణాలు తీసుకున్న ప్రతి సంఘాల సభ్యులు కంతులు సక్రమంగా కట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు సత్యానందం, దేవసేన, సీసీలు పాల్గొన్నారు.

విద్యార్థి నాయకులకు జైలు శిక్ష

ప్రొద్దుటూరు క్రైం : ప్రత్యేక హోదా ఉద్యమ సందర్భంగా 2016లో త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి నేరం రుజువు కావడంతో ఫస్ట్ ఏడీఎం హారిక నెల రోజులు జైలు శిక్ష విధించినట్లు త్రీ టౌన్‌సీఐ నారాయణయాదవ్‌తెలిపారు. 2016 ఆగస్టు 8న ప్రత్యేక హోదా ఉద్యమంలో భాగంగా ప్రొద్దుటూరులోని యోగివేమన యూనివర్సిటీ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించడానికి ప్రయత్నించారని ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపల్ ఫిర్యాదు మేరకు మల్లేల భాస్కర్, వీఎస్‌పల్లి మండలం పాయసంపల్లె చెందిన బండిసుల దస్తగిరి, కడపకు చెందిన కొండారెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో ముగ్గురికి నెల రోజులు జైలు శిక్ష లేదా ఒక్కొక్కరికీ రూ. 10,500 జరిమానా విధిస్తూ ఫస్ట్ ఏడీఎం హారిక గురువారం తీర్పు చెప్పినట్లు సీఐ తెలిపారు.